

లారీ డ్రైవర్ల ఆందోళన
మిల్లు యజమాని వైఖరిని నిరసిస్తూ పిలాయిపల్లిలో రైస్ మిల్లు ఎదుట లారీ డ్రైవర్లు ఆందోళన చేశారు. - 3లో



బీజేపీతోనే దేశ సమగ్రత
బీజేపీ నాయకులు శనివారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. బీజేపీతోనే దేశ సమగ్రత సాధ్యమన్నారు. - 3లో

వాతావరణం
గరిష్ఠం / కనిష్ఠం
40°/ 27°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాలకు నిధుల కేటాయింపు

భువనగిరిటౌన్ : లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. వాటి పరిధిలో మొత్తం 2,141 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వసతుల కల్పన కోసం ఒక్కో పోలింగ్ బూత్‌కు రూ.3 వేలు కేటాయించారు. నిధులు సరిపోని పక్షంలో గ్రామ పంచాయతీ నిధుల్లో నుంచి వినియోగించాలని ఆయా జిల్లాల పంచాయతీ అధికారులకు సూచిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిధులను పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజున వినియోగించనున్నారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు.

వీటికి ఖర్చు చేయనున్నారు
ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారులతో పాటు సిబ్బంది మొత్తం నలుగురు విధులు నిర్వహించనున్నారు. వీరికి భోజన ఏర్పాట్లు చేయాలి. కూలర్లు ఏర్పాటు చేయాలి. చల్లని మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. ఓటర్లకు నీడకోసం షామియానాలు, కూర్చునేందుకు కుర్చీలు, బెంచీలు సమకూర్చనున్నారు.

యాదాద్రిలో భక్తుల మొక్కులు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం , తులసీ దళాలతో అర్చన చేశారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం వేళ స్వామి, అమ్మవారి జోడు సేవలను ఊరేగించారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు మేలు



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి

ఆలేరురూరల్ : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు మేలు జరుగుతుందని టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్, నాయకులు సాగర్‌రెడ్డి, వెంకటరాజు, ఎజాజ్, గాజుల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లి పట్టు వస్త్రాలు బహూకరణ



పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకెళ్తున్న పోచంపల్లికి చెందిన రుద్ర వంశస్తులు


భూదాన్‌పోచంపల్లి: వరంగల్ పట్టణంలోని శ్రీ భద్రకాళి భద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9న ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా శనివారం నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో స్వామి, అమ్మవారికి పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరలు, పట్టు పంచెలను రుద్రవంశస్తులు అందజేశారు. గత రెండేళ్లుగా భద్రకాళి అమ్మవారికి, భద్రేశ్వరస్వామికి పోచంపల్లి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్నామని రుద్ర వంశస్థుడు, చేనేత ఉత్పత్తిదారుల సంఘం మాజీ అధ్యక్షుడు రుద్ర శ్రీశైలం తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్ర వంశస్తులు రుద్ర చెన్న కేశవులు, రుద్ర పాండురంగ శాస్త్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిపోయిన వాహనాలు



చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు



చౌటుప్పల్ పట్టణంలో రాత్రి..

ఎన్నికల రద్దీ

చౌటుప్పల్, బీబీనగర్ : జిల్లా పరిధిలోని హైదరాబాద్ - విజయవాడ, హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారులు శనివారం రద్దీగా మారాయి. 13వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్ జంటనగరాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ప్రజానీకం సొంతూళ్లకు బయలుదేరారు. ఈ క్రమంలో హైవేలపై వాహనాలు బారులుదీరాయి. పంతంగి, గూడూరు టోల్‌జాల వద్ద రద్దీ నెలకొంది.

చివరి రోజు.. ప్రచార హోరు

- ర్యాలీలు, రోడ్ షోలతో హోరెత్తించిన ప్రధాన పార్టీలు
- ఆఖరి నిమిషం వరకు సర్వశక్తులొడ్డిన అభ్యర్థులు
- సాయంత్రం ముగిసిన ఎన్నికల ప్రచారం
- పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

సాక్షి, యాదాద్రి : సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలక ఘట్టానికి తెరపడింది. దాదాపు రెండు నెలల పాటు హోరాహోరీగా సాగిన ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. అభ్యర్థులు ఆఖరి నిమిషం వరకు సర్వశక్తులు ఒడ్డి ప్రచారం చేశారు. ఇక మిగిలిన కొద్ది గంటల సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి మొత్తం 39 మంది బరిలో నిలిచారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, బీఎస్‌పీతో పాటు చిన్న పార్టీలు, స్వతంత్రులు పోటీలో ఉన్నారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి, నకిరేకల్ తుంగతుర్తి, ఆలేరు, జనగామ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మే13వ తేదీన పోలింగ్ జరగనుంది.

మండుటెండల్లో ప్రచారం
సుదీర్ఘంగా సాగిన ప్రచారంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు మండుటెండను లెక్కచేయకుండా ప్రచారం సాగించారు. భువనగిరి నుంచి ఒంటరిగా బరిలోకి దిగిన సీపీఎం సైతం పూర్వ వైభవం కోసం తీవ్రంగా శ్రమించింది. కాగా బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తున్న క్యామ మల్లేష్.. గెలుపుపై ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ కూడా పెద్ద ఎత్తున ఓట్లు సాధిస్తామన్న ధీమాతో ఉన్నారు.

పంపకాలు..
ప్రచారం ముగియడంతో పంపకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ ఓటుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఇవ్వడానికి సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని చోట్ల పంపకాలు మొదలైనట్లు సమాచారం. అంతే కాకుండా ముఖ్య నేతలను తమవైపు తిప్పుకునేందుకు పెద్ద మొత్తంలో ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది.



చౌటుప్పల్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, అభ్యర్థి కిరణ్‌కుమార్ రెడ్డి



భువనగిరిలో నిర్వహించిన బైక్ ర్యాలీలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్



భువనగిరిలో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్

మద్యం షాపులు బంద్

భువనగిరి క్రైం : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం అమ్మకాలు ఉండవని భువనగిరి ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. వైన్స్‌ల యజమానులు ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

చివరి రోజు పోటాపోటీగా..

చివరి రోజు ప్రచారం హోరెత్తింది. అభ్యర్థులతో పాటు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు రోడ్ షోలు, బైక్ ర్యాలీలు తీశారు.

- భువనగిరిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 2కే రన్, చౌటుప్పల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. వలిగొండలో ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు.
- భువనగిరిలో బీఆర్‌ఎస్ భారీ బైక్ ర్యాలీ తీసింది. ఈ ర్యాలీలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కొలుపుల అమరేందర్ పాల్గొన్నారు.
- సీపీఎం ఆధ్వర్యంలో భువనగిరిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్, రాష్ట్ర నాయకుడు ఎస్.వీరయ్య తదితర నాయకులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట, గుండాలలోనూ అభ్యర్థి ఎండీ జహంగీర్ ప్రచారం చేశారు. గుండాల మండల కేంద్రంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తీగల సాగర్ ప్రచారం చేశారు.
- బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా రామన్నపేటలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో పాటు నాయకులు ప్రచారం చేశారు.
- అడ్డగూడూరు మండలం కోటమర్తిలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ప్రచారం నిర్వహించారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, పక్కన డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్

సాక్షి, యాదాద్రి : భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంతు కే.జెండగే తెలిపారు. శనివారం ఆయన డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోమ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 2,141 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మొత్తం 18,80,585 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పోలింగ్ సామగ్రి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ విధుల్లో పాల్గొన్న ఉద్యోగుల్లో 11,193 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.

అమల్లోకి ఆంక్షలు
ఎన్నికల ప్రచారం ముగిసినందున అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలు, లౌడ్‌స్పీకర్లపై నిషేధం వంటి ఆంక్షలు ఉన్నాయన్నారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున డ్రైడేగా ప్రకటించామని, 11వ తేదీ సాయంత్రం 5గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు మూసి ఉంటాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.14.68 కోట్లు విలువ చేసే బహుమతులు, మద్యం, డ్రగ్స్‌తో పాటు నగదు కూడా సీజ్ చేసినట్లు చెప్పారు.

కేంద్ర బలగాలతో బందోబస్తు
సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో కేంద్ర బలగాలు, మిగతా కేంద్రాల్లో రాష్ట్ర పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు డీసీపీ రాజేశ్‌చంద్ర తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మహిళలు, పురుషులకు వేర్వేరుగా బారికేడింగ్ ఉంటుందన్నారు. కొత్త వ్యక్తులు, బయటి వారు ఉండరాదన్నారు. మీడియా సిబ్బందికి పోలింగ్ కేంద్రాల్లో ఫొటోలు తీయడానికి అనుమతి లేదని, పోలింగ్ కేంద్రం బయట ఉన్న క్యూలైన్ల ఫొటోలు,వీడియోలు తీసుకోవచ్చన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, గోదాంలు, ఫంక్షన్ హాళ్లు, రిసార్ట్స్, ఫాంహౌజులు తదితర చోట్ల నిఘా బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయని చెప్పారు. ప్రైవేట్ పార్టీలకు అనుమతి లేదన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఓటర్లు ఓటు వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి ఉండాలని, పోల్ చిట్టీలు తీసుకెళ్లాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలు సిద్ధం



భువనగిరిలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్

భువనగిరిటౌన్ : భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు పోలింగ్ సామగ్రి పంపిణీ చేసేందుకు జిల్లా కేంద్రంలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను అధికారులు సిద్ధం చేశారు. అదే విధంగా పోలింగ్ సిబ్బందికి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అమరేందర్ శనివారం గుర్తింపు కార్డులు అందజేశారు. వారంతా శనివారం రాత్రి అక్కడే ఉండి ఆదివారం పోలింగ్ సిబ్బందికి సామగ్రి అందజేయనున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత సామగ్రిని స్ట్రాంగ్ రూంకు తరలించే వరకు అక్కడే విధులు నిర్వర్తించనున్నారు.

స్వగ్రామాలకు వలస ఓటర్లు



భువనగిరి బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

- ఆర్టీసీ బస్టాండ్లు కిటకిట
- సకాలంలో బస్సులు రాక ఇబ్బందులు

భువనగిరి : లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వలస ఓటర్లు స్వగ్రామాలకు వస్తున్నారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వందలాది కుటుంబాలు వలసవెళ్లాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు వారిని రప్పించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోయినా స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వస్తున్నారు. వీరి రాకతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి వెళ్తున్నాయి. భువనగిరి బస్టాండ్‌లో రద్దీ నెలకొంది. అయితే కొన్ని బస్సులు భువనగిరి బస్టాండ్‌కు రాకుండా నేరుగా బైపాస్ నుంచి వెళ్తుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూస్తున్నారు. దీని వలన వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

పోలింగ్ సిబ్బంది కేటాయింపు

సాక్షి, యాదాద్రి : భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 566 పోలింగ్ కేంద్రాలకు శనివారం మూడో విడత ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బంది కేటాయించారు. కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాబర్ట్‌సింగ్ క్షేత్రిమయుమ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే సమక్షంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అదనపు పోలింగ్ ఆఫీసర్లు 2,264 మందిని కేటాయించారు. మరో 368 మందిని రిజర్వ్‌లో ఉంచారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) బెన్‌షాలోమ్, మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి, డీఈఓ నారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏఓ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. మార్పు చూపిస్తా

- కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : తనను ఎంపీగా గెలిపిస్తే భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం భువనగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగాని కాల్వల నిర్మాణం పూర్తిచేయకపోవడం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మూసీ ప్రక్షాళన, కాల్వల నిర్మాణం పూర్తిచేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుత కరువు పరిస్థితులకు బీఆర్‌ఎస్ అస్తవ్యస్త పాలనే కారణమని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తానని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల, రెండు మూడు మండలాలకు ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తానని చెప్పారు. చౌటుప్పల్, చిట్యాలలో అండర్‌పాస్‌ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. రీజినల్ రింగ్‌రోడ్డు వెంట ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయించి ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. విభజన హామీల్లో భాగంగా బీబీనగర్‌లో ఎయిమ్స్ ఏర్పాటైందని, కానీ, కొందరు తామే తీసుకువచ్చామని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే మార్పు చూపిస్తానని ఆయన పేర్కొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి సన్నద్ధత ఏదీ?

- పరీక్షలకు సమీపిస్తున్న సమయం
- ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులు
- మొదలు కాని ప్రత్యేక తరగతులు
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన



భువనగిరి : పదో తరగతి సప్లిమెంటరీ(అడ్వాన్స్) పరీక్షలపై విద్యాశాఖ అధికారులు ఇంకా దృష్టి సారించడం లేదు. ఉపాధ్యాయులంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండడంతో ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పరీక్షలకు సమయం ముంచుకొస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల విడుదల చేసిన పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆశించిన స్థాయిలో ఉత్తీర్ణత నమోదు కాలేదు. మొత్తం 9,108 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఏప్రిల్ 30 వెల్లడించిన ఫలితాల్లో 8,237 మంది (90.44 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఏ ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 69 శాతం మంది మాత్రమే పాసయ్యారు. వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం విద్యాశాఖ ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉంది. ఫలితాలు ప్రకటించిన రోజునే సప్లిమెంటరీ పరీక్షలకు షెడ్యూల్ విడుదలైంది. పరీక్ష ఫీజు చెల్లింపునకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉంది. జూన్ 3నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. కాగా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులంతా సార్వత్రిక ఎన్నికల విధుల్లో నిమగ్నం అయ్యారు. దీంతో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేవారు లేక విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

1,570 మంది ఫెయిల్
వార్షిక పరీక్షల్లో మొత్తం 1,570 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో సుమారు 565 మంది అనుత్తీర్ణులయ్యారు. సామాన్య శాస్త్రం, గణితంలో కూడా పెద్ద సంఖ్యలోనే ఫెయిల్ అయ్యారు. ఫెయిల్ అయిన వారికి పాఠశాలల్లో ఇప్పటికే ప్రత్యేక తరగుతులు ప్రారంభించాల్సి ఉంది. విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా సప్లిమెంటరీలో పాస్ మార్కులు సాధించేలా సన్నద్ధం చేయించాలి.

సైన్స్‌లో ఎక్కువగా..
గత విద్యా సంవత్సరం సామాన్య శాస్త్రం పరీక్ష పేపర్-1, పేపర్-2 పరీక్షలను ఒకే రోజు నిర్వహించారు. దీంతో సైన్స్‌లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఈ విద్యా సంవత్సరంలో సైన్స్ పేపర్-1, పేపర్-2ను వేర్వేరు రోజుల్లో నిర్వహించారు. అయినా సామాన్య శాస్త్రంలోనే ఎక్కువ మంది విద్యార్థులు తప్పారు.

ఫెయిల్ అయిన విద్యార్థులు ఇలా..
తెలుగులో 324, హిందీ 28, ఇంగ్లిష్ 213, గణితం 394, సైన్స్ 349, సాంఘిక శాస్త్రంలో 72 మంది ఫెయిల్ అయ్యారు.

ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశాం
పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేయాలని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేలా సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులను అందుబాటులో ఉండాలని సూచించాం. ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేస్తాం.
– నారాయణరెడ్డి, డీఈఓ

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఓటర్లను ఆకర్షించేలా...

కోదాడ రూరల్: కోదాడ పట్టణంలో మూడు చోట్ల ఓటర్లను ఆకర్షించేందుకు అధికారులు ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హుజూర్‌నగర్ రోడ్డులోని ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం, సీసీ రెడ్డి కాన్వెంట్‌లో మహిళా పోలింగ్ కేంద్రం, అనంతగిరి మండలం శాంతినగర్‌లో దివ్యాంగుల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను అధికారులు ప్రత్యేకంగా అలంకరించారు.


యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

నల్లగొండ: కలెక్టరేట్‌లో శనివారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తిచేశారు. పోలింగ్ సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తూ ర్యాండమైజేషన్ చేశారు. కార్యక్రమంలో నల్లగొండ కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన, సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు, నల్లగొండ ఏఆర్‌ఓ రవికుమార్, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్, సూర్యనారాయణ, వేణుమాధవ్, ఇన్ఫర్మేటిక్ అధికారి రావులు పాల్గొన్నారు.


ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకుడు

● ర్యాలీల జోరు


సూర్యాపేట: ర్యాలీగా వస్తున్న బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి


నకిరేకల్ పట్టణంలో బీఆర్‌ఎస్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ప్రజలు


మోత్కూరు పట్టణంలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు


మోత్కూరు మండలం ముశిపట్లలో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు


భువనగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ పార్టీకే బ్రాహ్మణుల మద్దతు

- అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు

రామగిరి(నల్లగొండ): లోక్‌సభ ఎన్నికల్లో బ్రాహ్మణులందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో బ్రాహ్మణ సమస్యలు పరిష్కరించబడతాయని అన్నారు. బ్రాహ్మణ సమాజం అంతా ఏకతాటి పైకి వచ్చి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి అకెళ్ల శ్రీనివాస్, ఫణి ఆచార్య, గొల్లపూడి మారుతీశర్మ, పులిజాల యాదగిరిరావు, తుమ్మగోటి పవన్‌కుమార్, తేనేపల్లి శేఖర్, దర్పెల్లి రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలరావు

ఖర్చుల లెక్కలను తనిఖీ చేయించుకోవాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తమ ఎన్నికల ఖర్చులకు సంబంధించిన లెక్కలను తనిఖీ చేయించుకోవాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్ అన్నారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల మూడో విడత తనిఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంకా ఎవరైనా అభ్యర్థులు ఖర్చులకు సంబంధించి రిజిస్టర్లు, ఖర్చులు సంబంధించిన వివరాలు మిగిలిపోయినట్లయితే తనిఖీ చేయించుకోవాలని, అలాగే జూన్ 30వ తేదీన నిర్వహించే కన్సాలిడేడ్ తనిఖీకి సైతం అభ్యర్థులందరూ హాజరుకావాలని సూచించారు. కాగా ఈ తనిఖీకి 22 మంది అభ్యర్థులు, వారి తరఫున ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో సహాయ వ్యయ పరిశీలకుడు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సంక్షేమ పథకాలు

చండూరు: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తేనే ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శనివారం చండూరు మున్సిపల్ పరిధిలోని అంగడిపేట గ్రామంలో నిర్వహించిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నర్సింహ, ఓబీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, జిల్లా నాయకులు సముద్రాల వెంకన్న, బోడ ఆంజనేయులు, బూతరాజు శ్రీహరి, సోమ శంకర్, మాదగోని స్వామి, పేర్ల గణేష్, తడకమల్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శులు బొబ్బల శివ, దుస్స గణేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

● ఓటు హక్కుపై అవగాహన


నల్లగొండ: ఓటర్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరిచందన, ఎన్నికల పరిశీలకులు


నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, ట్రాన్స్‌జెండర్స్



తుంగతుర్తి: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎన్నికల సిబ్బంది


నల్లగొండ: క్యాండిల్ వాక్‌లో పాల్గొన్న ట్రాన్స్‌జెండర్లు

ఓటేసేందుకు వెళ్తున్నాం..


చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు


నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై హోటళ్ల వద్ద ఆగిన వాహనాలు

- ఈ ఎన్నికలు మాకు ఎంతో ముఖ్యం
- ఆంధ్రప్రదేశ్ వాసుల వెల్లడి

చౌటుప్పల్ : ఓటు వేసేందుకు ప్రజలు స్వగ్రామాల బాటపట్టారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు మాత్రమే జరుగుతుండగా ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలలో నివాసం ఉండే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రజలు ఓటు వేసేందుకుగాను సొంతూళ్ల బాటపట్టారు. వరుస సెలవులు సైతం కలిసిరావడంతో కుటుంబాలతో కలిసి బయలుదేరారు. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పలువురు 'సాక్షి'తో మాట్లాడారు.

గొప్ప ఆశయం కోసం వెళ్తున్నాము



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు పార్టీలకే కాకుండా ప్రజలకు సైతం ఎంతో ప్రతిష్టాత్మకమైనవిగా చెప్పవచ్చు. అలాంటి ఈ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓట్లు వేయాల్సి ఉంటుంది. ఎంత దూరంలో ఉన్నా గొప్ప ఆశయం కోసం సొంతూరికి బయలుదేరాము. ఓటు వేసి ఆశయాన్ని గెలిపించుకుంటాము. – బాబుగౌడ్, నర్సాపురం, పశ్చిమగోదావరి

కుటుంబంతో కలిసి వెళ్తున్నాము



మా సొంతూరిలో ఓటు వేయాలని ముందుగానే నిర్ణయించుకున్నాము. ఆ ప్రకారంగా ముందే సెలవులు సైతం రావడంతో కుటుంబంతో కలిసి వెళ్తున్నాము. అసెంబ్లీ ఎన్నికలు ఎంతో ముఖ్యం.
– విజయ్, కొత్తపేట, కోనసీమ జిల్లా

ఓటు వేసేందుకు వెళ్తున్నాము



మేము కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటాము. ఓటు మాత్రం మా సొంతూర్లో ఉంది. అసెంబ్లీ ఎన్నికలు కావడంతో కచ్చితంగా ఓటు వేయాలన్న సంకల్పంతో వెళ్తున్నాము.
– వెంకటేశ్వరరావు, చిలకలూరిపేట

ప్రతిసారి ఓటు వేస్తాను



ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఓటు వేస్తున్నాను. 2019 మాదిరిగానే అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. కావున తప్పనిసరిగా ఓటు వేయాల్సి ఉంది. ప్రతిసారి ఓటుహక్కును వినియోగించుకుంటాను. – వసంత్‌కుమార్, మైలవరం

ఫలితాలు తారుమారు కావొద్దని



ఎన్నికల్లో ఒక్క ఓటు ఎంతో కీలకంగా ఉంటుంది. ఒక్కోసారి ఒక్క ఓటుతోనే అభ్యర్థుల తలరాత మారుతుంది. దూర ప్రాంతాలలో నివాసం ఉండే వ్యక్తులు ఓటింగ్‌లో పాల్గొనకపోతే ఫలితాలు తారుమారు అయ్యే ప్రమాదం ఉంటుంది. అలాంటి పరిస్థితి రావొద్దని మేమంతా ఓట్లకు వెళ్తున్నాము.
– శ్రీధర్, విశాఖ ఈస్ట్

మంచి తీర్పు రావాలని



ఓటు వేయడం మన హక్కు. ఓటుతో చక్కటి అభ్యర్థిని ఎన్నుకోవచ్చు. మార్పు కోరుకోవచ్చు. అందుకే అసెంబ్లీ నియోజకవర్గంలో మేము ఓటు వేసి మంచి అభ్యర్థిని గెలిపించుకోవాలని నిర్ణయించుకున్నాము. ఆ మేరకు స్వగ్రామానికి భయలుదేరాము.
– మురళి, కాకినాడ

ఊరి నుంచి పిలుపు వచ్చింది



ఎన్నికల నేపథ్యంలో మా స్వగ్రామం నుంచి మాకు పిలుపు వచ్చింది. కచ్చితంగా ఓటు వేసేందుకు రావాలని వివిధ పార్టీల నాయకులు అడిగారు. ఓటు వేయడం మన హక్కు కాబట్టి కుటుంబసభ్యులందరం కలిసి వెళ్తున్నాము.
– గోపాల్, నందిగామ, కృష్ణాజిల్లా

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

- దోరకుంట వద్ద భర్త మృతి.. భార్యకు గాయాలు
- కోటినాయక్‌తండా వద్ద మరో వ్యక్తి..
- సూర్యాపేట జిల్లా పరిధిలో ఘటనలు

కోదాడ రూరల్: జిల్లాలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. మరొక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలు శనివారం చోటుచేసుకున్నాయి. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం రంగయ్యగూడెం గ్రామానికి చెందిన ఎర్రపు వీరబాబు(45) తన భార్య రజినితో కలిసి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై దోరకుంటలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో దోరకుంట వద్దకు వెళ్లిన తర్వాత వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న టీవీఎస్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వీరబాబుకు తీవ్రగాయాలు కాగా రజినికి స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా వారి కుమారుడు ఇటీవలే బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడి భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు.


వీరబాబు (ఫైల్)


షేక్ సైదా(ఫైల్)

ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొని..

ఆత్మకూర్(ఎస్): మండలంలోని కోటినాయక్ తండా వద్ద శుక్రవారం రాత్రి బైక్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కాశీగూడెం గ్రామానికి చెందిన షేక్ సైదా (32) వ్యక్తిగత పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి 11గంటల సమయంలో మండల పరిధిలోని కోటినాయక్ తండా వద్దకు రాగాను తాను నడుపుతున్న బైక్.. దంతాపల్లి నుంచి సూర్యాపేట వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న సైదా తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు సైదాకు భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని తల్లి షేక్ బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ వై.సైదులుగౌడ్ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి క్రైం: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బీబీనగర్-పగిడిపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్యలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె.కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం బీబీనగర్-పగిడిపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య గల 228/5-7 ఎగువ లైన్‌పై వెళ్తున్న రైలు కింద సుమారు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని బూడిదరంగు నైట్ ప్యాంటు, బ్లాక్ టీషర్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు 9848223169, 8712568454 నంబర్లలో తెలపాలని కోరారు.

రైలు నుంచి కిందపడి మరొకరు మృతి

నార్కట్‌పల్లి: గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి కింద పడి మృతి చెందిన సంఘటన శనివారం నార్కట్‌పల్లి–చిట్యాల మధ్య 56వ ట్రాక్ పక్కన చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే ట్రాక్ పక్కన ఒక గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు చిట్యాల స్టేషన్ మాస్టర్‌కు సమచారం అందింది. దీంతో రైల్వే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రైలు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడని గుర్తించినట్లు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు, అతనికి దాదాపు 30 నుంచి 40 వయస్సు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భార్య తరఫు బంధువుల దాడిలో భర్త మృతి

- నల్లగొండ జిల్లా కేంద్రంలో ఘటన

నల్లగొండ క్రైం: భార్య తరఫు బంధువుల దాడిలో భర్త మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ శ్రీనివాస కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న సయ్యద్ వలీ (40) భవన నిర్మాణ రంగంలో కూలి పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఇతని భార్య బీబీ ఇంటి వద్దే ఉండేది. రోజు మద్యం తాగి వచ్చి గొడవ పడుతున్నాడని వలీ భార్య తన అల్లుడు రిజ్వాన్‌కు శనివారం ఫోన్ చేసి చెప్పింది. దీంతో రిజ్వాన్ తన స్నేహితుడైన నవీన్, సాజిద్‌లను వెంట తీసుకుని వలీ ఇంటికి వచ్చి అతనితో వాగ్వాదానికి దిగి దాడి చేశారు. ఈ క్రమంలో వలీని తలపై కర్రతో కొట్టడంతో తీవ్ర గాయమై రక్తస్రావం అవుతూ కిందపడ్డాడు. దీన్ని గమనించిన ఇంటి పక్కవారు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా వాహనం రావడంతో సయ్యద్ వలీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రి అవుట్ పోస్టు నుంచి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు భార్య బీబీని పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. గొడవ జరిగిన సమయంలో తాను లేనని తర్వాత విషయం తెలిసిందని పోలీసులకు తెలిపింది. దీంతో మృతుడు భార్య బీబీతో పాటు రిజ్వాన్, నవీన్, సాజిద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు పితృవియోగం

దేవరకొండ: దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తండ్రి రమావత్ కనీలాల్ శనివారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఆస్పత్రిలోనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆస్పత్రికి చేరుకొని కనీలాల్ పార్థివదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేటీఆర్ వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులున్నారు. కాగా కనీలాల్ 2019లో దేవరకొండ మండల పరిధిలోని రత్యతండా సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.


కనీలాల్ పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పిస్తున్న కేటీఆర్

చెరువులో పడి మహిళ మృతి

సూర్యాపేట: సద్దుల చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు మోతె శ్రీనివాస్ సతీమణి రమాదేవి(45) మానసిక స్థితి కొంతకాలంగా బాగుండడం లేదు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వచ్చిన రమాదేవి స్థానిక సద్దుల చెరువులో పడి శవంగా తేలింది. స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉండగా అందరు విదేశాల్లో స్థిరపడ్డారు.